
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు జిల్లా వార్తలు 3

మంగళవారం 7 అక్టోబరు 2025



ఇంటింటికీ జీఎస్టీ 2.0 ఫలాలు..!

- 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరిట అవగాహన
- 16న కర్నూలులో 3 లక్షల మందితో భారీ సభ
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరు
- మూడు స్థలాలు పరిశీలించిన మంత్రుల బృందం
- ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష



సమీక్షలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు



కర్నూలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో తగ్గిన జీఎస్టీతో ఇంటింటికీ జీఎస్టీ2.0 ఫలాలు చేరుతున్నాయి. తగ్గింపు జీఎస్టీ ప్రయోజనాలు, సంస్కరణలపై విస్తృత ప్రచారం చేయడంతో పాటు ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించేందుకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరిట వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగానే ఈ నెల 16న కర్నూలులో మూడు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. దేశంలోనే ఇది తొలి సభ. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ సభను నిర్వహిస్తోంది. మూడు లక్షల మంది హాజరయ్యేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. సభా స్థలం ఎంపికపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సారథ్యంలో మంత్రులు, ప్రజాప్రతినిధుల బృందం సోమవారం మూడు స్థలాలను పరిశీలించారు.



మాట్లాడుతున్న మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, బీసీ

మూడు లక్షల మందితో భారీ సభ

ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలు, ప్రయోజనాలపై ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కర్నూలు నగరంలో ఈ నెల 16న మూడు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సహా కూటమి ముఖ్య నేతలు పాల్గొనే ఈ సభ ఏర్పాటుకు నన్నూరు టోల్ ప్లాజా వద్ద, రాగమయూరి వెంచర్, ఓర్వకల్లు సమీపంలో జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమ వద్ద మూడు స్థలాలను రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి పరిశీలించారు.

మిగతా 4వ పేజీలో

సమస్యలను గడువులోపు పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల నుంచి వచ్చిన సమస్యలను నాణ్యతతో గడువులోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. లాగిన్‌లో వచ్చిన అర్జీలను అలసత్వం వహించకుండా పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయ గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని బీయాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అజయ్ కుమార్, అనూరాధ, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కొండన్న, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విచారణ జరిపి న్యాయం చేస్తాం

- పీజీఆర్ఎస్‌కు 58 ఫిర్యాదులు
- ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 58 మంది వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చుకున్నారు. వీటిలో ప్రధానంగా... రైల్వే శాఖలో ప్రభుత్వ ఉద్యోగం లేదా మైక్రోసాఫ్ట్‌వేర్‌లో ప్రైవేటు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి హైదరాబాదుకు చెందిన విజయభాస్కర్ రూ.7 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు చెందిన దినేష్ నాయుడు ఫిర్యాదు చేశారు. ఫోర్జరీ సంతకాలతో నకిలీ భూమి పట్టాభూమి ఇచ్చి రూ.10లక్షలు తీసుకుని తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసాలకు పాల్పడుతున్న కుమ్మరి విజయలక్ష్మి, రాముడు, ఏజెంట్ చిలక రాజశేఖర్‌లపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కర్నూలు ఏ.క్యాంప్ చెందిన ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. పెద్దపాడు చెందిన గిడ్డయ్య అనే వ్యక్తి రూ.5లక్షలు తీసుకుని ఇవ్వడం లేదని, రూ.8 సంవత్సరాల నుంచి పక్షవాతంతో ఉన్నానని, కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చినా కూడా స్పందించడం లేదని కర్నూలు కొత్తపేటకు చెందిన జే.లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశాడు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తమ భూమిని సాగు చేసుకుంటూ మోసం చేస్తున్న నాగరాజు అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని హోళగుంద మండలం పెద్దహ్యాట్ గ్రామానికి చెందిన సతీష్ ఫిర్యాదు చేశారు. పెద్దపాడు గ్రామం దగ్గర ఉన్న హరికృష్ణ నగర్‌లోని తమ ప్లాట్‌లో వేరే వ్యక్తులు రాళ్ల పాతి మోసం చేస్తున్నారని, న్యాయం చేయాలని కర్నూలు ఆదిత్య నగర్‌కు చెందిన లక్ష్మీరెడ్డి ఫిర్యాదు చేశారు.

ముగిసిన బన్ని ఉత్సవాలు

- నెరణికి గ్రామానికి ఉత్సవమూర్తులు



దేవరగట్టు నుంచి నెరణికి గ్రామానికి ఉత్సవ మూర్తులను తీసుకెళ్తున్న భక్తులు

హొళగుంద, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాలు ముగిసినట్లు సోమవారం ఆలయ నిర్వాహకులు, పూజారి గిరి మల్లయ్య స్వామి తెలిపారు. ఈనెల రెండో తేదీన గొలుసు తెంపే కార్యక్రమంతో పాటు కంకణం విసర్జన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం దేవరగట్టు నుంచి మాళమల్లేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగిశాయని, నెరణికి గ్రామంలో ఉత్సవమూర్తులను ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హొళగుంద ఎస్ఐ గురజాల దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు డీజీపీ రాక

కర్నూలు క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా మంగళవారం కర్నూలుకు రానున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న కర్నూలు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను సమీక్షించేందుకు డీజీపీ రానున్నారు. ప్రధాని పర్యటించే ప్రాంతాల్లో ఆయన పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేయనున్నారు.

కుండపోత వర్షం



- పొంగి పొర్లిన వాగులు, వంకలు
- వర్షానికి కొట్టుకుపోయిన మొక్కజొన్న పంట

రుద్రవరం/ చాగలమర్రి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ఆళ్లగడ్డ, రుద్రవరం, చాగలమర్రి మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు జలమయమయ్యాయి. పలు చోట్ల రాకపోకలు స్తంభించాయి. రుద్రవరంలో 70.2. మి.మీ, చాగలమర్రిలో 75.2 మి.మీ వర్షపాతం నమోదైంది. నల్లమల అటవీ తీరంలో సైతం భారీ వర్షం కురిసింది. మొక్కజొన్న పంట కోత కోసి ఆరబెట్టుకున్న ధాన్యం నీట మునిగి దెబ్బతినింది. రుద్రవరం మండలంలో 12,625 ఎకరాల్లో మొక్కజొన్న ఖరీఫ్ సీజన్‌లో సాగు చేశారు.



గొట్లూరులో కందిపంటలో నిలిచిన వర్షపు నీరు

ముకుందాపురం, ఆలమూరు, ముత్తలూరు, నల్లవాగుపల్లె, టి.లింగందిన్నె, చిత్తరేణిపల్లె, కొండమా యల్లె, వెలగలపల్లె, కోటకొండ, యల్లావత్తుల, శ్రీరంగాపురం, డి.కొట్టాల గ్రామాల పరిధిలో మొక్కజొన్న రైతులకు భారీ నష్టం జరిగింది. లక్ష క్వింటాళ్లకు రూ.2వేల చొప్పున రూ.20కోట్లు నష్టం వాటిల్లింది. ముత్యాలపాడు, శెట్టివీడు, చాగలమర్రి గ్రామాల్లోని రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం పట్టాలు కప్పినా కప్పిన భారీవర్షానికి నీట మునిగింది. పంటలకు ప్రభుత్వం పరిహారమిచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

టమోటాకు గిట్టుబాటు ధర అందిస్తాం

- మార్కెటింగ్ శాఖ కడప రీజనల్ డీడీ లావణ్య
- పత్తికొండ మార్కెట్ యార్డులో తనిఖీలు

పత్తికొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులకు గిట్టుబాటు ధర అందించేలా చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ కడప ఆర్‌డీడీ(రీజినల్ డిప్యూటీ డైరెక్టర్) లావణ్య అన్నారు. సోమవారం పత్తికొండ మార్కెట్ యార్డును ఆమె తనిఖీ చేశారు. మార్కెట్‌కు వచ్చిన టమోటా నాణ్యతను పరిశీలిస్తూ రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచి ధర అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, మీరు కూడా గ్రేడింగ్ టమోటాను మార్కెట్‌కు తీసుకువస్తే మంచి ధరను అందించేందుకు అవకాశం ఉంటుందని రైతులకు సూచించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లి మార్కెట్‌కు సంబంధించిన ప్రాంతాల్లో రైతులు స్టేకింగ్ పద్ధతిలో టమోటాను సాగుచేస్తున్నారని, అక్కడి టమోటా నాణ్యతతో పోల్చుకుంటే పత్తికొండ ప్రాంతంలో కొద్దిగా నాణ్యత తక్కువగా కనిపిస్తుందన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ఇబ్బందులు కలిగిస్తున్నారా అన్న కోణంలో కూడా విచారణ చేపడుతామన్నారు. ప్రస్తుతం ఉన్న వ్యాపారులతో పాటు వేరే ప్రాంతాల నుంచి వ్యాపారులను కొనుగోలుకు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.



మార్కెట్‌యార్డులో పంటను పరిశీలిస్తూ రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డీడీ లావణ్య

ఎమ్మిగనూరు కార్యదర్శికి అదనపు బాధ్యతలు

పత్తికొండ మార్కెట్‌యార్డులో సమస్యలను పరిష్కరించేందుకు ప్రస్తుతం పనిచేస్తున్న కార్యదర్శి కార్నలిస్‌తో పాటు ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు కార్యదర్శి పద్మావతికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నామని ఆర్‌డీడీ తెలిపారు. పత్తికొండ మార్కెట్‌యార్డులో సమస్యలు సద్దుమణిగే దాకా ఆమె అదనపు బాధ్యతలలో కొనసాగుతారన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

పత్తికొండ మార్కెట్‌యార్డులో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. విజిలెన్స్ తహసీల్దార్ వెంకటరమణ, అసిస్టెంట్ జియాలజిస్టు సిద్ధయ్య మార్కెట్‌లో పంట కొనుగోళ్లను పరిశీలించడంతో పాటు మార్కెట్‌యార్డు పరిస్థితులపై రైతులను ప్రత్యేకంగా విచారించారు.

మట్టిమిద్దె కూలి చిన్నారి మృతి 5

రోగులకు నాణ్యమైన సేవలు అందించండి

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్

పల్లెల్లో ఎన్నికల సందడి

- ఏర్పాట్లపై అధికారుల దృష్టి
- త్వరలో పంచాయతీలకు ముగియనున్న పదవీకాలం



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో త్వరలో ఎన్నికల సందడి ప్రారంభం కానుంది. 2025 ప్రారంభంలోనే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలకు అధికారులు ఇప్పటి నుంచే కసరత్తు చేపడుతున్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎన్నికల ప్రక్రియను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు త్వరలోనే నగరా మోగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. వచ్చే ఏడాది మార్చిలో మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో పదవీ కాలం ముగియనుంది. అదేవిధంగా పంచాయతీలకు గడువు పూర్తి కానుంది. వచ్చే సంవత్సరం జరగనున్న ఎన్నికలు ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్

- 2025 అక్టోబరు 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి.
- అక్టోబరు 16 నుంచి నవంబరు 15లోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ప్రచురించాలి.
- నవంబరు 1 నుంచి 15వ తేదీలోగా ఎన్నికల అధికారుల నియామకం పూర్తి చేయాలి.
- నవంబరు 16 నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు. ఈవీఎంలు, బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయాలి.
- డిసెంబరు 15లోపు రిజర్వేషన్లు ఖరారు చేయాలి.
- డిసెంబరు చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి.
- 2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్, అదే నెలలో ఫలితాల ప్రకటన.

2021లో ఎన్నికలను పరిశీలిస్తే..

జిల్లా వ్యాప్తంగా 3 డివిజన్లు, 25 మండలాలు, 282 గ్రామ పంచాయతీలు, 5,100 పంచాయతీ వార్డులు ఉన్నాయి. మొత్తం అన్ని పంచాయతీల్లో ఎన్నికలు జరిగాయి. రూరల్ పరిధిలోని గ్రామ జనాభా 15,11,314లో 7,63,225 పురుషులు, 7,43,089 స్త్రీలు కలరు. వీరిలో పురుషులు 5,55,916 పురుషులు, 5,59,900 మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సర్పంచ్ రిజర్వేషన్లు

షెడ్యూల్ ఏరియాల్లో ఎస్టీలకు 20, నాన్ షెడ్యూల్ ఏరియాలో ఎస్టీ 15, ఎస్సీ 15, బీసీ 256, అండ్ రిజర్వ్ 490, వార్డులు వారిగా రిజర్వేషన్లు షెడ్యూల్ ఏరియాలో 158, నాన్ షెడ్యూల్ ఏరియాలో ఎస్టీ 120, ఎస్సీ 2001, బీసీ 2783, అన్ రిజర్వ్ 4944కు కేటాయించారు.



జిల్లా పంచాయతీ కార్యాలయం



ప్రతి పల్లెలోనూ బీజేపీ జెండా ఎగరాలి

రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

5 లో

అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



అంధుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని అరుణభారతి సంస్థ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పిలుపునిచ్చారు. తన తల్లిదండ్రులు, బీసీ గురెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం ప్రారంభించిన పింఛన్ల పంపిణీకి 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం బనగానపల్లె పాత బస్టాండ్ సమీపంలోని బీసీ గుర్రెడ్డి కాంప్లెక్స్ ఆవరణంలో అంధులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులతో పాటు సోదరుడు బీసీ బాలతిమ్మారెడ్డికి నివాళులర్పించిన అనంతరం బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ 2009నుంచి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అంధులకు ప్రతి నెలా ఒకటో తేదీన 160 మందికి రూ.500 చొప్పున తన సొంత నిధులతో పింఛన్లు అందజేస్తున్నానన్నారు. 17వ వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా ఈ నెల నుంచి 200 మంది అంధులకు మరో రూ.200 పెంచి రూ.700 పింఛన్ అందజేస్తున్నట్లు తెలిపారు. అంధులను ఎవరూ చిన్నచూపు చూడకూడదని, అంధులు, దివ్యాంగులను గౌరవించాలన్నారు. ప్రస్తుతం డబ్బుకోసం పరుగెడుతూ మానవ సంబంధాలు దూర మవుతున్నాయన్నారు. అంధులకు మనోధైర్యం ఉంటుందని, వారు ఆత్మవిశ్వాసంతో బ్రెయిలీలిపితో ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాల సంపాదించాలని ఆకాంక్షించారు. ఎంతో మంది పట్టుదలతో చదివి ఐఏఎస్‌లు అయ్యారన్నారు. హైదరాబాద్‌కు చెందిన గొల్ల శ్రీకాంత్ అమెరికాలో చదివి రూ.300కోట్ల సామ్రాజ్యానికి అధిపతి అయి ఎంతోమందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బనగానపల్లె మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ కులమత, ప్రాంతాలకు అతీతంగా బీసీ రాజారెడ్డి సొంత నిధులు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. అనంతరం అంధులు, వారి సహాయకులకు భోజనవసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గజల్ కళాకారుడు మహమ్మద్‌మియా, రిటైర్డు ఉపాధ్యాయుడు మద్దిలేటి, బొబ్బల మహేశ్వరరెడ్డి, బలరాం, భరతుడు, ఉపసర్పంచ్ బురానుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

యాగంటీశ్వరుని సేవలో దక్షిణ కొరియా వాసులు



యాగంటీశ్వరుడిని దర్శించుకున్న దక్షిణ కొరియా వాసులు

బనగానపల్లె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర స్వామివారిని సోమవారం దక్షిణ కొరియా దేశస్థులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వారు భారతదేశంలోని పలు ప్రాంతాలను సందర్శిస్తున్న క్రమంలో యాగంటి బసవయ్య, ఉమామహేశ్వరున్ని దర్శించుకున్నారు. వీరికి యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే యాగంటి ఆలయాభివృద్ధికి ప్యాపిలికి చెందిన కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.10వేలు విరాళం అందించారు.

మహానందీశ్వరుని సన్నిధిలో ప్రముఖులు



పూజలు నిర్వహించి వస్తున్న జెన్ కో చీఫ్ ఇంజనీర్ తిరుమల ప్రసాద్

మహానంది, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు చేశారు. బెంగళూరు అడిషనల్ ఎస్పీ దీపక్, జెన్‌కో చీఫ్ ఇంజనీర్ తిరుమల ప్రసాద్ స్వామివారిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వారిక అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. అలంకార మంటపంలో వేదపండితులు వీరిని ఆశీర్వదించి, కండువాతో సత్కరించారు. వీరివెంట మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, కానిస్టేబుల్ శేషన్న ఉన్నారు.

సర్దార్ నాగప్ప సేవలు చిరస్మరణీయం

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



సర్దార్ నాగప్ప చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ తదితరులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు తొలి శాసన సభ్యుడు, రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా సర్దార్ నాగప్ప, స్వాతంత్ర సమర యధురాలిగా ఆయన సతీమణి అమరావతమ్మ అందించిన సేవలు చిరస్మరణీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ నాగప్ప జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ, సర్దార్ నాగప్ప జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ సర్దార్ నాగప్ప రాజ్యాంగ పరిషత్ సభ్యునిగా మన రాజ్యాంగ నిర్మాణంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన వారసుడిగా దామోదరం సంజీవయ్యను రాజకీయాల్లోకి తెచ్చారన్నారు. జిల్లా మొత్తం గర్వించదగిన నాయకుడిగా వారు చరిత్ర పుటల్లో నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షుడు జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, వేదిక సభ్యులు జేవీ కృష్ణయ్య, శేషయ్య, పెరికల రంగస్వామి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్య, మాజీ మేయర్ బంగి అనంతయ్య, కేసీ కల్కూర, జేఎస్ఆర్‌కే శర్మ, ఇనయతుల్లా, డా.పార్వతి, క్రిష్టఫర్, సర్దార్ నాగప్ప కుటుంబ సభ్యులు, దళిత సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



క్లస్టర్ వర్సిటీ నిర్మాణంలో ఉన్న భవనం

పాలన అస్తవ్యస్తం

- ఆర్‌యూలో పడకేసిన ఉన్నత విద్య
- మసకబారుతున్న వర్సిటీల మనుగడ
- రాజకీయాలకు ఆజ్యం పోస్తున్న ప్రొఫెసర్లు
- ఏసీ గదులకు పరిమితమైన పర్యవేక్షణాధికారులు
- క్లస్టర్‌లో అటకెక్కిన వైసీపీ నేత వ్యవహారం? ● కలెక్టర్ దృష్టి సారించాలంటున్న విద్యార్థి సంఘాలు
- ఆధిపత్య, అంతర్గత పోరులతో నలిగిపోతున్న విద్యార్థులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు యూని వర్సిటీల్లో ఉన్నత విద్య పడకేసింది. విద్యార్థుల చేరికలపై ప్రచారం లేదు.. కోర్సులపై అవగాహన కల్పించే దిక్కే లేకపోవడంతో చేరికలు పడిపోయాయి. ప్రొఫెసర్ల మధ్య ఆధిపత్య, అంతర్గత పోరులో ఉన్నత చదువులు నలిగిపోతున్నాయని పేద విద్యార్థులు ఆవేదన చెందుతు న్నారు. దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేక ఉపాధి కోర్సులతో ఏర్పాటైన క్లస్టర్ వర్సిటీకి 55ఎకరాల్లో రూ.86కోట్లతో నిర్మించిన భవనాలు ఉండి కూడా వాటిని స్వాధీనం చేసుకో లేకపోతుంది. డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతోంది. కొత్తగా వచ్చిన కలెక్టర్ దృష్టి సారించి గాడిలో పెట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఒకేషనల్ కోర్సు, స్కిల్ డెవలప్‌మెంట్, బేసిక్, ప్రొఫెషనల్ కోర్సులు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంగా ఏర్పాటైన అన్ని వర్సిటీల్లో ఒకే బేసిక్ కోర్సులుండటంతో విద్యార్థుల్లో గందరగోళం నెలకొంది.

జిల్లాలోని మూడు యూనివర్సిటీల్లో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఉన్నత చదువులు.. పాలన అంశాల కంటే కూడా ఇక్కడ రాజకీయాలు ఎక్కువయ్యాయి. ప్రొఫెసర్లు, ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పాలన అంతా ఏసీ గదులకే పరిమితమైంది. స్థానిక ప్రొఫెసర్లు పదవుల కోసం కొట్లాడుకోవడం.. విద్యార్థులను పావులుగా వాడుకుంటున్నారు. వారికి చదువుకు బదులు.. రాజకీయాలు నేర్పుతున్నారు. మరికొందరు ప్రొఫెసర్లపైన ఫైళ్ల చోరీ, సీఐడీ, విజిలెన్స్ కేసులున్నాయి. ఇవన్నీ వెరసి వర్సిటీల్లో చదువులు, పాలన మసకబారుతోందనే విమర్శలున్నాయి.

వైసీపీ ప్రభుత్వం ఒక్కపైసా..

రాష్ట్ర విభజన తర్వాత మైనార్టీల కోసం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని కర్నూలులో ఏర్పాటుచేశారు. 2016 నుంచి అద్దె భవనంలో నడుస్తోంది. డిగ్రీ-4, పీజీ- 9 కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఓర్వకల్లు సమీపంలో 2017లో 149 ఎకరాల్లో రూ.18కోట్ల నిధులు కేటాయించగా కేవలం రూ.5కోట్లు అప్పటి టీడీపీ ప్రభుత్వం విడుదల చేసింది. గత వైసీపీ పాలనలో ఒక్క పైసా నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక వాటి నిర్మాణాలపై ఆరా తీస్తోంది.

అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు

ఉర్దూ యూనివర్సిటీ ప్రస్తుతం అద్దె భవనానికి ప్రతినెల రూ.2.63లక్షలు బాడుగ చెల్లించలేక ఇబ్బందులు పడుతోంది. సకాలంలో అద్దె చెల్లింపులు లేకపోవడంతో బిల్డింగ్ యాజమాని ఖాళీ చేయాలంటూ లీగల్ నోటీసులు కూడా ఇచ్చారని విద్యార్థులు వాపోతున్నారు. వర్సిటీ ఉన్నతాధికారులు ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గదులు కేటాయించాలని ఉన్నత విద్యామండలిని ఆశ్రయించింది. క్లస్టర్ వర్సిటీ అధి కారులు అందుకు ససేమిరా అన్నారు. అద్దె భవనంలోనే అరకొర వసతులతో విద్యా ర్థులకు సరైన రక్షణలేని భవనంలోనే కొనసాగుతోంది. వర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి వంద శాతం అడ్మిషన్ల ప్రక్రియను పూర్తిచేశారు. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా సౌకర్యాలు, వసతులు లేక అధికారులు, విదార్థులు తల్లిడిల్లిపోతున్నారు.

కలెక్టర్ గాడిలో పెట్టాలి

కలెక్టర్ ఉన్నతవిద్యను గాడిలో పెట్టాలి. పేద విద్యార్థుల సంక్షేమం కోసం జిల్లాలో మూడు యూనివర్సిటీలు కోట్ల నిధులతో ఏర్పాటు చేశారు. సమర్థులైన అధికారులను నియమించకపోవడంతో లక్ష్యం దారి తప్పుతోంది. ఫలితంగా ఉన్నత విద్య కోసం విద్యార్థులు ఇతర జిల్లాలకు వేళ్లే పరిస్థితులు జిల్లాలో దాపురించాయి. వనరులను సక్రమంగా వినియోగించుకునే దిశగా కలెక్టర్ దిశానిర్దేశం చేయాలి.

● రాగిరి చంద్రప్ప, రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్

అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో..

రూ.86కోట్లతో క్లస్టర్ వర్సిటీకి నగర శివారులోని జగన్నాథగట్టుపై 55ఎకరాల్లో నిర్మిం చారు. వైసీపీ పాలనలో నిర్మాణాల్లో అవకతవకలు జరి గాయనే ఆరోపణలతో కూటమి ప్రభుత్వం నిర్మాణాలను నిలిపేసింది. ఏపీఎంఐడీసీ అనే ప్రభుత్వ సంస్థ పేరుతో నిర్మాణాలు ఎందుకు చేపట్టారనే కోణంలో ప్రభుత్వం ప్రశ్నించింది. విచారణకు ఆదేశం చాలని హడావుడి చేసింది. ప్రస్తుతం ఆఊసులే లేకుండాపోయింది. ఫలితంగా సిల్వర్ జూబ్లీ కళాశాలలో తాత్కాలికంగా వర్సిటీ నడుస్తోంది. మార్చి 2021లో ప్రతేక కోర్సులతో క్లస్టర్ యూనివర్సిటీ ఏర్పాటైంది. ఇప్పటి వరకు పనిచేసిన ఉపకులపతి, రిజిస్ట్రార్ల పదవీ కాలం పూర్తికావడంతో వారిని మాతృ సంస్థలకు ప్రభుత్వం పంపింది. ప్రస్తుతం సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల లను క్లస్టర్ వర్సిటీలో చేర్చారు. గతంలో పనిచేసిన అధికారులు రాజకీయాలు, కక్ష సాధింపులకే ప్రాధాన్యత ఇచ్చారనే విద్యార్థులు ఆరోపిస్తున్నారు. భవనాలు ప్రారంభానికి నోచుకోక పోగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మరోవైపు వర్సిటీని రద్దు చేస్తారంటూ ప్రచారం ఉందని విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ రాజకీయ నేతకు.. ఓ మాజీ మంత్రికి ఆశీస్సులుండటంతో ఫైలు ఇంచి కూడా ముందుకు కదలడం లేదని కొందరు ప్రొఫెసర్ల వద్ద ఓ ఉన్నతాధికారి ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

సమర్థ వంతమైన పాలన లేక..

ఆర్‌యూ(రాయలసీమ యూనివర్సిటీ)లో వనరులు, సౌకర్యాలు ఉన్నప్పటికి సమర్థవంతమైన పాలన లేదు. ఏళ్ల తరబడి కోట్ల నిధులు పక్క దారి పట్టడమే కాక, విజిలెన్స్, సీఐడీ కేసులు, అక్రమాలు, ఆందోళనతో రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చుకుంది. గాడిన పెట్టాల్సిన ఉన్నత విద్యామండలి సైతం రాజకీయ జోక్యంతో చేతులు ఎత్తేసింది. వర్సిటీకి 2008లో 285 ఎకరాలు భూములు కేటాయించినా కొంతమేర భూములు అన్యాక్రాంతమయ్యాయనే ఆరోపణలున్నాయి. 2024 విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీలో 16కోర్సులకు విద్యార్థుల సంఖ్య 310కి పడిపోయింది. ఉపకులపతులు పేరుకు మాత్ర మే తమ పదవిని అనుభవించి పోతున్నారే తప్ప అభివృద్ధి జాడ ఎక్కడ కనిపించడం లేదని విమర్శలున్నాయి.

కేసులతో ముడిపడి..

ఇటీవల పాలకమండలిలో కోర్టు కేసులతో ముడిపడి ఉన్న పలు వివాదాస్పద అం శాలు వర్సిటీకి చెడ్డపేరు తెచ్చిపెడుతున్నాయి. ఉన్నత విద్యామండలి కూడా ఇందుకు వత్తాసు పలకడం. అడ్డగోలు నిర్ణయాలను ప్రశ్నించకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తాయిలాలు ప్రకటించి ప్రశ్నించే గొంతు లేకుండ.. అన్ని తానై వ్యవహ రించడంలో ఓ కాంట్రాక్టు ఉద్యోగి పన్నిన వ్యూహం ఫలించడంపై ప్రస్తుతం క్యాంపస్‌లో చర్చనీయాంశమైంది. ప్రశ్నించాల్సిన విద్యార్థి సంఘాల మనుగడ లేకపోవడంతో ఉన్నతాధికారుల తీరుపై విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న ఉర్దూ యూనివర్సిటీ

ఇంటింటికీ జీఎస్టీ 2.0 ఫలాలు..!

(3వ పేజీ తరువాయి)

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, బీద రవిచంద్ర, ప్రధానమంత్రి కార్యక్రమాలు స్పెషల్ కో-ఆర్డినేటర్ వీరపాండియన్, కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు డాక్టర్ ఎ.సిరి, రాజకుమారి, ఎస్పీలు విక్రాంత్ పాటిల్, సునీల్ షెరాన్, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, గౌరు చరిత, భూమా అఖిలప్రియ, కేఈ శ్యాంబాబు, డాక్టర్ పార్థసారథి, బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏ.రామకృష్ణ తదితరులు పరిశీలించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భద్రత, ఉమ్మడి కర్నూలు, నంద్యాల సహా రాయలసీమ జిల్లాల నుంచి తరలివచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా, సభ దిగ్విజయం చేసేలా మూడు స్థలాలను పరిశీలించారు. చివరికి రాగమయూరి వెంచర్ ఎంపిక చేశారు.

ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష

ఈ నెల 16న ప్రధాని మోదీ సభను దిగ్విజయం చేయడం, జన సమీకరణ, భద్రత, బందోబస్తు, రూట్ మ్యాప్‌పై స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాకు చెందిన ఎంపీ, ఎమెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నేతలతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. దాదాపు గంటకు పైగా జరిగిన సమావేశంలో సభా నిర్వహణపై పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గాల వారిగా జన సమీకరణపై కూడా చర్చించారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సభా ఏర్పాటు కమిటీల్లో బాధ్యతలు అప్పగించే అంశాలపై కూడా చర్చించారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా, సమన్వయంతో కష్టపడి 16న జరిగే ప్రధాని మోదీ సభను దిగ్విజయం చేద్దామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. వేదిక, బస్సులు సమకూర్చడం వంటివాటిపై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా సభను విజయవంతం చేయాలన్నారు. రెవెశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఈ సభను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా దిశానిర్దేశం చేశారని, ప్రతి ఒక్కరు బాధ్యతగా దిగ్విజయం చేసేందుకు కృషి చేయాలన్నారు. మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సభా నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రోడ్ల కనెక్టివిటీ పెంచాలని రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈలను ఆదేశించారు. పీఎం కార్యక్రమాల స్పెషల్ ఆఫీసర్ వీర పాండియన్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహ కారంతో సభను విజయవంతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, సీఎం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, టీడీపీ ఆదోని ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, ఆలూరు, మంత్రాలయం ఇన్‌చార్జిలు వైకుంఠం జ్యోతి, ఎన్.రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ, ఏపీ కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ప్రధాని పర్యటనకు 6వేల మందితో బందోబస్తు

● ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కోసం ఆరు వేల మందితో భద్రత, బందోబస్తును సిద్ధం చేస్తున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో లైజనింగ్ అధికారులు, సెక్టార్ ఆఫీసర్లతో ఆయన సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటన నిమిత్తం వీవీఐపీలు, డీజీపీ, ఐజీ, డీఐజీ స్థాయి వంటి ఐపీఎస్ అధికారులు జిల్లాకు వస్తుంటారని, లైజనింగ్ ఆఫీసర్లు, సెక్టార్ ఇన్‌చార్జి, లైజనింగ్ అధికారులు విధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎయిర్‌పోర్టు, రోడ్డు డైవర్షన్స్, చెక్ పాయింట్లు, ట్రాఫిక్ నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. దాదాపు 6వేల మంది భద్రతా సిబ్బంది జిల్లాకు వస్తారని, ఈ నెల 13న ఫోర్స్ రిపోర్టు, 14న ట్రయల్ రన్ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు హుశేన్ పీరా, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

డెమోగా బాధ్యతలు స్వీకరించిన ప్రకాష్ రాజ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా మాస్ మీడియా అధికారి (డెమో)గా ఎన్.ప్రకాష్‌రాజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.ప్రకాష్‌రాజ్ కర్నూలు జిల్లా మాస్ మీడియా అధికారిగా పదోన్నతి పొందారు. దీంతో సోమవారం ఆయన కర్నూలు జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డెమోగా విధుల్లో చేరారు. ఈ మేరకు కొత్త డెమోకు డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ హెచ్ఈవో పద్మావతి, ఎంపీహెచ్ఏ స్టేట్ అసోసియేషన్ చైర్మన్ సి.చిన్నరాముడు, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర అభినందనలు తెలిపారు.



పసిడి పరుగులు

- 10గ్రా బంగారం ధర రూ.1,22,000 చేరిన వైనం
- సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుతున్న ధరలు
- వ్యాపారాలు తగ్గుముఖం



కొలిమిగుండ్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా మార్కెట్లో పసిడి ధర పరుగులు పెడుతోంది. సోమవారం ఒక్కరోజే 10గ్రా బంగారం ధరపై రూ.1,800 పెరిగింది. సరిగ్గా ఏడాది క్రితం 10గ్రా బంగారం ధర రూ.70వేలు ఉండగా, ప్రస్తుతం రెండింతల ధరకు చేరువవుతోంది. 24క్యారెట్ల బంగారం ధర మార్కెట్లో రూ.1,22,000కు చేరింది. బంగారం ధరలు చూసి సామాన్య, మధ్య తరగతి ప్రజల కళ్లు బైర్లు కమ్మే పరిస్థితులు నెలకొంది. ప్రస్తుత ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనే పరిస్థితులు లేవని ఆవేదన చెందుతున్నారు. గత మంగళవారం ఏకంగా రూ.2900 పెరిగి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించినట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. నిలకడలేని ధరల కారణంగా బంగారం వ్యాపారాలు సైతం పూర్తిగా తగ్గుముఖం పట్టాయని వ్యాపార వర్గాలు ఆవేదన చెందుతున్నాయి.

శ్రీశైలానికి చేరుకున్న ఛత్రపతి పల్లకీ యాత్ర



పల్లకీ యాత్రలో పాల్గొన్న ముధోజి రాజే భోస్లే

శ్రీశైలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ పల్లకీ యాత్ర విజయవాడ నుంచి శ్రీశైలం వరకు 300 కిలోమీటర్లు సాగి సోమవారం శ్రీశైలంలోని ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రానికి చేరుకుంది. ఈ కేంద్రంలో దక్షిణ దిగ్విజయ్ దివస్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహారాజ రాజశ్రీ ముధోజి రాజే భోస్లే, ఛత్రపతి శివాజీ మహారాజ్ 13వ వారసులు పాల్గొన్నారు. 1677 అక్టోబరు 6వ తేదీన ఛత్రపతి శివాజీ తన అనుచరులు, సైన్యంతో కలసి ఈ తెలుగు నేల మీద అడుగుపెట్టి 348 సంవత్సరాలు పూర్తవుతుందని వారు తెలిపారు. ప్రతిఏడాది ఈ పల్లకి యాత్రను నిర్వహిస్తూ వారి ఆశయాలను, ఆలోచనలను కొనసాగించేలా చూస్తామన్నారు. ఈ యాత్రకు సహకరించిన సభ్యులకు, ఆయా గ్రామాల ప్రజలకు వారు ధన్యవాదాలు తెలిపారు.

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

- నలుగురికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఒకే కుటుంబంలోని నలుగురికి తీవ్ర గాయాల య్యాయి. బంధువులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఎస్.బోయినపల్లి ఎస్సీ కాలనీలో బండ నాగరాజు, బండ సువర్ణ దంపతులు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి బండ అనిల్, బండ చరణ్ సంతానం. సువర్ణ ప్రస్తుతం గర్భిణి. రోజూ మాదిరిగానే ఆదివారం కుటుంబసభ్యులందరూ నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి సమయం లో ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఇంటి లోపల అంతటా మంటలు వ్యాపించాయి. ఈప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో పాటు ఇంటి గోడలు బీటలు వారాయి. చుట్టుపక్కల వారు గమనించి బంధువులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు స్థానికుల సహాయంతో హుటాహుటిన ఆటోలో వెల్దుర్తి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. క్షతగాత్రులకు వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు.

ఎస్సీ బాబు జిల్లా బహిష్కరణ

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

సంజామల/ కోవెలకుంట్ల అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆల్వకొండ ఎస్సీ బాబును జిల్లా బహిష్కరణకు కలెక్టర్ ఆదేశించినట్లు కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ తెలిపారు. సోమవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా సంజామల మండలం ఆల్వకొండకి చెందిన ఎస్సీ బాబు గ్రామంలో, మండలంలో నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయబ్రాంతులకు గురి చేయడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించాడు. నిందితుడి వివరాలను కలెక్టర్ రాజకుమారికి సమర్పించగా జిల్లా నుంచి బహిష్కరించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు నెలల వరకు జిల్లాలో అడుగు పెట్టరాదని, ఎక్కడైనా కనిపించినా, ఉత్తర్వులను ధిక్కరించినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఎస్సార్బీసీ కాల్వలో పడి వ్యక్తి మృతి

బనగానపల్లె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన నరేశ్ (20) అనే వ్యక్తి చెర్వుపల్లె నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళుతూ అదుపు తప్పి ఎస్సార్బీసీ కాల్వలో పడి మృతిచెందినట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. నరేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి నరేశ్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

యువకుడు ఆత్మహత్య



ధనుంజయ (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గువ్వలదొడ్డిలో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈడిగ భీమన్న కుమారుడు ఈడిగ ధనుంజయ (30)కు మూడేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలుగలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది పొలంలో పురుగుల మందు తాగాడన్నారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



వీరారెడ్డి

నంద్యాల టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన వీరారెడ్డి అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడు. దీంతో తన కుమారుడు వెంకటసుబ్బారెడ్డి సోమవారం తాలుకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఈశ్వరయ్య వివరాల ప్రకారం.. ఈనెల 2న వీరారెడ్డి గుడికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లు, పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇటుకతో కొట్టి.. మిద్దెపై నుంచి పడేసి..

- భార్యను దారుణంగా హతమార్చిన భర్త
- ఆర్. క్రిష్ణాపురంలో ఘటన, పరారైన నిందితుడు
- గాలింపు చేపట్టిన పోలీసులు



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ ప్రమోద్, సీఐ మురళీధర్‌రెడ్డి

ఆళ్లగడ్డ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఓ భర్త నిద్రిస్తున్న తన భార్యను ఇటుకతో తలపై కొట్టి.. మిద్దెపై నుంచి పడేసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన మండలంలోని ఆర్.క్రిష్ణాపురం గ్రామంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. చింతకుంట గ్రామానికి చెందిన శేషగిరికి ఆర్.క్రిష్ణాపురం గ్రామానికి చెందిన ఓబులమ్మ(40)కు ఇచ్చి 19 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శేషగిరికి గ్రామంలో 1.5 ఎరాల భూమి ఉండగా దానిని అమ్మడంతో రూ.40లక్షలొచ్చాయి. ఈనేపథ్యంలో వ్యసనాలకు బానిసై డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేయసాగాడు. నిత్యం తాగి వచ్చి భార్య ఓబులమ్మతో గొడవ పడేవాడు. దీంతో కొన్ని రోజుల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భార్యపై అనుమానంతో అతడు రగిలిపోయాడు. ఆదివారం అర్ధరాత్రి ఇంటిపైన భార్య నిద్రిస్తుండగా వచ్చి సిమెంట్ ఇటుకలతో తలపై కొట్టి మిద్దెపై నుంచి కిందపడేసి దారుణంగా హత్యచేసి పరారయ్యాడు. విషయం తెలిసిన వెంటనే ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు అధికారులు ఘటనాస్థలికి చేరుకున్నారు. హత్య జరిగిన వివరాలు తెలుసుకొని నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని నంద్యాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మామపై అల్లుడు కత్తితో దాడి

గోస్పాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దీబగుంట్ల గ్రామంలో మద్యం మత్తులో మామపై అల్లుడు ఆదివారం రాత్రి కత్తితో దాడి చేశాడు. సోమవారం బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సుధాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయ చిన్న నరసింహుడు తన కూతురును అదే గ్రామానికి చెందిన మురళికి ఇచ్చి ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేశాడు. అయితే, అల్లుడు మద్యానికి బానిసై తరచూ కూతురును ఇబ్బందులకు గురి చేసేవాడు. ఆదివారం రాత్రి కూడా మురళి తాగి వచ్చాడు. దాంతో ప్రవర్తన మార్చుకోవాలని చిన్న నరసింహుడు అల్లుడికి చెప్పడంతో కోపోద్రిక్తుడైన మురళి కత్తితో మామపై దాడిచేశాడు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. సోమవారం చిన్న నరసింహుడు భార్య సుబ్బలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు మురళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులపై తేనేటీగల దాడి

గడివేముల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులపై సోమవారం తేనేటీగలు దాడి చేశాయి. మధ్యాహ్నం విద్యార్థులు తరగతి గదికి వెళ్తుండగా తేనేటీగలు గుంపుగా లేచి దాడి చేశాయి. ఎనిమిది మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడిని గడివేముల పీహెచ్‌సీకి తరలించారు. హెచ్ఎం శైలజ అప్రమత్తమై విద్యార్థులను హాస్టల్ గదుల్లో ఉంచారు.

ప్రతి పల్లెలోనూ బీజేపీ జెండా ఎగరాలి

- రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



సమావేశంలో ఖడ్గం ఎత్తి అభివాదం చేస్తున్న నాయకులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి పల్లెలో, ప్రతి ఇంటిలో బీజేపీ జెండా ఎగరాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఓ కల్యాణమండపంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా సునీల్ రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నగరంలోని రాజ్‌విహార్ కూడలి నుంచి పెద్దపార్కు, పాత కంట్రోల్ రూం మీదుగా సభాస్థలికి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుందన్నారు. పార్టీలోని అన్ని అనుబంధ విభాగాల్లో యువతకు పెద్ద పీట వేస్తామన్నారు. రాయలసీమలో ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమలకు ఏర్పాటుకు బీజేపీ ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. సీమ ప్రాంతంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వ దృష్టికి తీసుకవెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం ఎంతో వెనకబడిందని, దీని కోసం గతంలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశామన్నారు. రాయలసీమ హక్కుల ఐక్య వేదిక ఏర్పాటు చేసి చాలా వరకు సాధించామన్నారు.

రాయలసీమ డిక్లరేషన్‌ను మరోసారి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై అంచనాలతో నివేదించిన ప్రభుత్వాలు మారటంతో కార్యరూపం దాల్చలేదని, దానిని మరోసారి ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ఎవరినైన అందలం ఎక్కించేది కేవలం ఒక్క బీజేపీ పార్టీలోనే అన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఇతర పార్టీల్లోలాగా వారసత్వాలను నమ్ముకున్న పార్టీ కాదని, బీజేపీ జవసత్వాలతో పనిచేసే పార్టీ అన్నారు.

పార్టీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కల్గిన కమ్యూనిస్టు పార్టీలు నామరూపాల్లేకుండా పోతే, జాతీయవాదం కల్గిన బీజేపీ దేశాన్ని పాలిస్తోందన్నారు. శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ క్రమశిక్షణ, విలువలు కలిగి అంకితభావంతో బాధ్యతలు నిర్వర్తించే వారికి పార్టీలో ఎదుగుదల ఉంటుందన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడుతూ బీజేపీ అభిమానులు కార్యకర్తలుగా మారి నాయకులుగా ఎదగాలని అకాంక్షించారు.



పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా సునీల్‌రెడ్డి

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా సునీల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మంత్రాలయానికి చెందిన ఆయన గతంలో ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనను నేతలు, కార్యకర్తలు శాలువ కప్పి, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, గీతామాధురి, వినూషరెడ్డి, అంకాల్‌రెడ్డి, కుర్ని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలు అందించండి

- డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్



క్యాన్సర్ హాస్పిటల్‌ను పరిశీలిస్తున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రోగులకు నాణ్యమైన సేవలు అందించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను రాష్ట్రానికి ఆదర్శంగా నిలపాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ రఘునందన్ తెలిపారు. సోమవారం కర్నూలు సర్వజన వైద్యశాలను డీఎంఈ సందర్శించారు. అన్ని విభాగాల హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, పరిశుభ్రత, రోగుల పట్ల సేవభావం కలిగి ఉండాలని డీఎంఈ ఆదేశించారు. అనంతరం స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్, నర్సింగ్ స్కూల్‌ను పరిశీలించారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై డీఎంఈ ఆరా తీశారు. వైద్యసిబ్బందితో మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన సేవలు అందించడంలో రాజీ ఉండకూడదన్నారు. చికిత్స పొందుతున్న క్యాన్సర్ రోగులతో మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను విస్తృతంగా ఉపయోగించి సేవల నాణ్యతను పెంచాలని సూచించారు.

నర్సింగ్ కాలేజీలో సమీక్ష

కాలేజ్ ఆఫ్ నర్సింగ్ హాస్టల్ వసతులను డీఎంఈ పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లను ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్ సమీపంలో ఉన్న నర్సింగ్ స్కూల్ భవనాన్ని డీఎంఈ పరిశీలించారు. కొత్త భవనానికి సం బంధించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించి దీనిపై ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో చర్చించారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్స్, వైద్యులు పాల్గొన్నారు.

మట్టిమిద్దె కూలి చిన్నారి మృతి

- త్రుటిలో తప్పించుకున్న కుటుంబ సభ్యులు
- మాధవరం గ్రామంలో ఘటన





కూలిన మట్టిమిద్దె.. చిన్నారి లలిత (ఫైల్ ఫొటో)

మంత్రాలయం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు ఓ మట్టిమిద్దె కూలి ఓ చిన్నారి అనంత లోకాలకు చేరింది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి మాధవరం గ్రామంలో చోటుచేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నాగలదిన్నె భీమరాయుడు, నాగమ్మ దంపతుల ఇల్లు మట్టిమిద్దె. భీమ రాయుడు భార్య నాగమ్మ, కొడుకు మల్లికార్జున, కూతురు శ్రావణి, మనుమళ్లు, మనుమరాలు లలిత(5) ఇంటిలో నిద్రించారు. ఇరవై రోజులుగా కురిసిన భారీ వర్షాల కు మట్టిమిద్దె పూర్తిగా దెబ్బతిని వారు నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్ప కూలింది. అందులో భీమరాయుడు, నాగమ్మ, మల్లికార్జున, శ్రావణి త్రుటిలో తప్పించు కున్నారు. చిన్నారి లలిత మట్టిలో కూరుకుపోయింది. కుటుంబీకులు మట్టిని తొలగించి చిన్నారిని కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆమె మృతిచెందింది. చిన్నారి తల్లిదండ్రులు రామాంజిని, మహేశ్వరి దంపతులు గోనెగండ్ల మండలం గంజిహళ్లిలో నివాసం ఉంటున్నారు. కాగా పాపను చదువు కోసం అమ్మమ్మ వద్ద ఉంచారు. లలిత మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో రూ.25వేలు విలువ చేసే గొర్రెలు మృతి చెందగా.. మరో రెండు గొర్రెలు ప్రాణాలతో బయటపడ్డాయి. చిన్నారి మృతదేహాన్ని సొంత గ్రామం గంజిహళ్లికి తీసుకెళ్లి అంత్య క్రియలు చేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

మట్టిమిద్దె కూలి చిన్నారి లలిత మృతి చెందడం బాధాకరం. విచారణ జరిపాం. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం. ● **రమాదేవి, తహసీల్దార్**

బాణసంచా స్వాధీనం

కోడుమూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఇళ్ల మధ్యలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను సోమవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ డి.వై స్వామి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ నిల్వలపై దాడులు చేసి సరుకును స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందన్నారు. పట్టుబడిన బాణసంచాను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని వివరించారు.

అనారోగ్యంతో సీఐ మృతి



కర్నూలు క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో సీఐ జాన్సన్ బాబు రావు సోమవారం రాత్రి 8.35 మృతి చెందారు. వివరాల మేరకు.. కొద్దికాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి అధికంగా విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు అమీలియో ఆసుపత్రికి, అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. 2002 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఈయన సొంతూరు జిల్లా కడప. కర్నూలులో వన్‌టౌన్, డీసీఆర్‌బీ, కోర్టు మానిటరింగ్ తదితర పోలీస్ స్టేషన్లలో పని చేశారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో పోస్టింగ్ రాగా, డీఐజీ కార్యాలయంలో అటాచ్‌మెంటులో ఉంటున్నారు. పలువురు పోలీసు అధికారులు సంతాపం తెలిపారు. ఈయనకు భార్య ఉంది, సంతానం లేరు.

కుందూలో శవం లభ్యం

నంద్యాల టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కుందూ నదిలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు తాలుకా సీఐ ఈశ్వరయ్య తెలిపారు. సోమవారం కుందూ నది భీమవరం వద్ద 30నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న పురుషుడి శవం కొట్టుకు వచ్చినట్లు స్థానికులు గుర్తించారు. మెడలో సాయి బాబా డాలర్, గద ఉన్నట్లు ఉంది. అలాగే కుడి చేతిపై అమ్మ అనే పచ్చబొట్టు ఉంది. ఎవరైనా ఆనవాళ్లు గుర్తించగలుగుతే తాలుకా పోలీసులను సంప్రదించాలని కోరారు.

వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

- జీజీహెచ్‌లో బంధువుల ఆందోళన
- నష్టపరిహారం ఇస్తామని రాసిచ్చిన సూపరింటెండెంట్



ధర్నా చేస్తున్న బాధితులు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నంద్యాలలోని జీజీహెచ్‌లో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కొలిమిగుండ్ల మండలం చెన్నంపల్లె గ్రామానికి వెంకటరమణ(40) కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. నాపరాతి గనిలో పనిచేస్తుండగా బండరాయి కాలిపై పడింది. అక్కడ వైద్యం చేయించుకున్నప్పటికీ నయం కాలేదు. గత నెల 29వ తేదీన నంద్యాల జీజీహెచ్‌లో చేరారు. అప్పట్నుంచి వైద్యులు అతడికి యాంటీ బయాటిక్ ఇంజక్షన్లు ఇస్తున్నారు. కొంతమేరకు గాయం తగింది. ఎముక విరగడంతో ఆపరేషన్ నిమిత్తం సోమవారం యథావిధిగా యాంటీ బయాటిక్ ఇంజక్షన్ ఇచ్చారు. కొద్ది నిమిషాల వ్యవధిలోనే అతడు మృత్యువాత పడ్డాడు. చికిత్స కోసం వస్తే ప్రాణాలు తీస్తారా అంటూ బంధువులు మృతదేహాన్ని మార్చురీకి పంపకుండా ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే వెంకటరమణ చనిపోయాడంటూ ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాజకుమారి, డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ, తహసీల్దార్ శ్రీనివాసులును జీజీహెచ్‌కు పంపి విచారణ చేయించారు. మృతుడి బంధువులు తమకు నష్టపరిహారం చెల్లించాలని పట్టుబట్టడంతో చివరకు కలెక్టర్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందించడానికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి బాధితులకు ఆర్థిక సాయం కోసం లిఖిత పూర్వకంగా రాసిచ్చారు.

కార్డియాక్ అరెస్ట్‌తో మృతి..

వెంకటరమణ మృతిచెందిన ఘటనలో వైద్యుల నిర్లక్ష్యంలేదు. ఇంజక్షన్ వికటించలేదు. సర్జరీ కోసం ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లేముందు యాంటీ బయాటిక్ ఇంజక్షన్ ఇచ్చారు. మృతుడు కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెంది ఉండొచ్చు.

● **డాక్టర్ మల్లేశ్వరి, సూపరింటెండెంట్, జీజీహెచ్, నంద్యాల**

జీఎస్టీ తగ్గింపుతో పెరగనున్న కొనుగోలు శక్తి



వాహనాలను పరిశీలిస్తున్న జేసీ, జాయింట్ కమిషనర్

కర్నూలు న్యూసిటీ , అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తగ్గించిన జీఎస్టీతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందని జాయింట్ కమిషనర్ జె.నీరజ అన్నారు. సోమవారం ఎస్‌ఏపీ క్యాంపులో జీఎస్టీ ఎక్స్‌పోను జాయింట్ కలెక్టర్ డా.నవ్య ప్రారంభించారు. స్టాళ్లను జేసీ, అధికారులు పరిశీలించారు. నిత్యావసర వస్తువులు, స్టేషనరీ, మెడిసిన్లుతో పాటు టూ వీలర్, కార్లు, ట్రాక్టర్ల తగ్గిన ధరలపై అవగహన వచ్చేలా బోర్డులు ఏర్పాటు చేశారు. డీఎస్‌వో రాజా రఘువీర్, డీసీ మురళి మనోహర్, ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్ బాషా, వ్యాపార సంస్థల అధినేతలు పాల్గొన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

అనుమతిలేని బాణాసంచా విక్రయంపై కేసు

గూడూరు అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా బాణాసంచా విక్రయించినవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. సోమవారం పట్టణంలోని జనరల్ స్టోర్‌లో బాణాసంచా విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి, రూ.5వేల విలువ చేసే బాణాసంచా స్వాధీనం చేసుకున్నారు. యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

కర్నూలు అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం ప్రజా పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 19 ఫిర్యాదులు వచ్చాయని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, ఎంహెచ్‌వో డా. సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రధాని పర్యటన పేరుతో రోడ్డుపక్కన ఉండే చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని సీఐటీయూ నగర అధ్యక్షుడు మహమ్మద్ రఫి డిమాండ్ చేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద న్యూసిటీ అధ్యక్షుడు రాముడు, శేఖర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కమిషనర్ ప్రభుత్వ అతిథి గృహంలో ఉన్నారని తెలిసి అక్కడి వరకు ర్యాలీగా వెళ్లి, నిరసన తెలిపారు. కమిషనర్ విశ్వనాథ్‌కు వినతిపత్రం ఇచ్చారు. విజయరామంజనేయులు, అబ్దుల్ దేశాయ్, నగేష్, హెక్బాల్, నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కోడుమూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేనశారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. శేషకుమార్, కృష్ణ, సిద్దిబాబు, శివుడు, శంకర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే



కలెక్టర్‌తో ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఏ.సిరిని సోమవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మర్యాద పూర్వకంగా కలిశారు. బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోడుమూరు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. స్పందించిన కలెక్టర్ నివేదికను తెప్పించుకొని చూస్తానని హామీ ఇచ్చారు.

బిందె నీటి కోసం.. బండెడు కష్టాలు

- కోడుమూరులో తాగునీరు అందక ప్రజల అవస్థలు
- అధిక వర్షాలతో హంద్రీ నదిలో కొట్టుకుపోయిన పైపులైన్లు
- జీడీపీ నుంచి ప్రత్యేక పైపులైన్ వేస్తే పరిష్కారమయ్యే అవకాశం
- పట్టించుకోని గత ఎమ్మెల్యేలు



ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

కోడుమూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తాగునీరందక కోడుమూరు పట్టణ ప్రజలు అల్లాడిపోతున్నారు. 20 రోజులుగా సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రజలు బిందెలు పట్టుకుని తిరుగుతున్నారు. పట్టణానికి ప్రధాన వనరు అయిన హంద్రీనదిలో వేసిన పైపులైన్లు అధిక వర్షాలతో దెబ్బతిన్నాయి. దీంతో తాగునీటి సరఫరా ఆగిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని కోటవీధి, పెద్దబోయగేరి, బీసీకాలనీ, చిన్నబోయగేరి, ఆకులవీధి, గొల్లగేరి, చాకలి వీధి, షణ్ముఖనగర్ తదితర కాలనీల్లో ఇదే పరిస్థితి.

హంద్రీ నీరే గతి..

సుమారు 45వేల జనాభా ఉన్న కోడుమూరు పట్టణ ప్రజలకు తాగునీటికి హంద్రీనదిలో వేసిన తాగునీటి పైపులైన్లే గతి. అక్కడి నుంచి పైపు లైన్లదారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందుకు పట్టణంలో దాదాపు 8 వరకు ఓవర్‌హెడ్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. అయితే అధిక వర్షాలకు హంద్రీ నది నిండి, పైపులైన్లు కొట్టుకుపోవడంతో సమస్య ఉత్పన్నమైంది.

హంద్రీలో ఎక్కువ నీరున్నా, ఎండినా సమస్యనే..

హంద్రీనదిలో నీటి ఉధృతి పెరిగితే పైపులైన్లు కొట్టుకుపోయి సమస్య వస్తుంది. అయితే నది పూర్తిగా ఎండిపోతే నీటి నిల్వలు లేక తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుంది. దీంతో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. నది ఎండిపోయిన ప్రతిసారి జీడీపీ లేదా ఎల్లెల్సీ నుంచి నదికి నీటిని విడుదల చేయించుకొని తాగునీటి అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోంది. దీంతో ప్రజలు నిత్యం మినరల్ వాటర్ కొనాల్సి వస్తోంది.

హామీ నెరవేర్చని గత ఎమ్మెల్యేలు



పట్టణంలోని తాగునీటి సమస్య తీరాలంటే గాజుల దిన్నె ప్రాజెక్టు నుంచి ప్రత్యేక పైప్‌లైన్ వేయాలి. ఇలా చేస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ప్రతి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు హామీ ఇచ్చి, గెలిచిన అనంతరం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. 2009 నుంచి ఇలాగే అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత టీడీపీ బొగ్గుల దస్తగిరి స్పందించి జీడీపీ నుంచి పైపులైన్ వేయించి తమ సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నెల నుంచి ఇబ్బంది పడుతున్నాం



నెల రోజులుగా తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నాం. తప్పని పరిస్థితుల్లో శుద్ధజలం(మినరల్ వాటర్)ను కొనుగోలు చేస్తున్నాం. దసరా రోజు మాత్రమే ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద నీరు విడుదల చేశారు. ప్రజా ప్రతినిధులు స్పందించి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

- లక్ష్మణస్వామి, కోటవీధి, కోడుమూరు

విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన



మాట్లాడుతున్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శైలజ

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వై.శైలజ అవగాహన కల్పించారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రజలు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ మాట్లాడుతూ జీఎస్టీపై అవగాహన ఉంటే ఫైనాన్స్, అకౌంటింగ్, ఎడిటింగ్, క్యాస్ట్ కన్సల్టింగ్ రంగాల్లో ఉద్యోగాలు వస్తాయన్నారు. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేఎల్ గాయత్రి, రామకృష్ణ, మల్లికార్జున, విజయశేఖర్, పాల్గొన్నారు.

సీజేఐపై దాడిచేసిన వ్యక్తిని శిక్షించాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కర్నూలు లీగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తిని శిక్షించాలని నేషనల్ లాయర్స్ ఫోరం అధ్యక్షుడు వై.జయరాజు ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈదాడి భారత న్యాయ వ్యవస్థపై దాడి చేయడమే అని, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై దాడిని కర్నూలు బార్ అసోసియేషన్ నాయకులు ఖండించారు. అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

జీఎస్టీ ఫలాలు అందరికీ అందాలి

కర్నూలు అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఫలాలు అందరికీ అందాలని రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం క్లస్టర్ యూనివర్సిటీలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేవీఆర్, సిల్వర్ జూబ్లీ, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రిన్సిపాళ్లు ఇందిరా శాంతి, కె. వెంకటరెడ్డి, ఆధ్యాపకులు ఎల్లా కృష్ణ, డీన్స్ నాగరాజు శెట్టి, మహమ్మద్ వాహీజ్, అక్తర్‌భాను పాల్గొన్నారు.

మహాసభలకు తరలిన చేనేతలు

కోడుమూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లిలో నిర్వహిస్తున్న చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలకు కోడుమూరు చేనేత నాయకులు తరలివెళ్లారు. సోమవారం మహాసభలో రాజు, లక్ష్మన్న, మల్లేష్, కృష్ణ, గఫూర్‌మియా, వీరన్న, మునిస్వామి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బేడ బుడగ జంగాల రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ కోరారు. సోమవారం కర్నూలులో వినతి పత్రం సమర్పించారు. 2025 మార్చి 20న సీఎం చంద్రబాబు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారన్నారు. ప్రధాని మోదీ తమకు అపాయింట్‌మెంట్ ఇచ్చేలా చూడాలని కోరారు

జీఎస్టీ తగ్గింపుతో ఉపశమనం

కర్నూలు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఉపశమనం కలిగిందని మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ జీవీ కృష్ణ అన్నారు. సోమవారం నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ, టెలికాం నగర్‌లో అవగాహన కల్పించారు. ఆర్వోలు జునైద్, వాజీద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్ అన్నారు. జిల్లా ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం రగ్బీ జిల్లా జట్ల ఎంపికకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూడు శాతం క్రీడా రిజర్వేషన్ కోటాలో ఉన్నత విద్య ఉపాధి ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్ సహకారంతో రగ్బీ క్రీడను అభివృద్ధి చేశామన్నారు. ఎస్జీఎఫ్ కార్యదర్శి టి.కృష్ణ, మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. టీ.కృష్ణ, రామాంజనేయులు, దాసరి సుధీర్, పాల్గొన్నారు.

9న జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం

కర్నూలు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కర్నూలు ఇన్‌చార్జి, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మి నరసింహ యాదవ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశానికి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి గణేష్ కుమార్ యాదవ్, ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి హాజరవుతారన్నారు.

విత్తనాల కోసం నమోదు చేసుకోవాలి

కల్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): శనగ, వేరుశనగ విత్తనాలు కావలసిన రైతులు సమీప రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏవో విష్ణువర్ధన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి శనగలు-1430, వేరుశనగలు-150 కేటాయించారన్నారు. పప్పుశనగ క్వింటా రూ.7,800లు కాగా, సబ్సిడీ రూ.1,950లు పోను రైతులు రూ.5,850లు చెల్లించాలన్నారు.



ఏవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నష్టపరిహారం ఇవ్వాలి

ఓర్వకల్లు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఏవో మధుమతికి వినతి పత్రం సమర్పించారు. పత్తి, మొక్కజొన్న, ఉల్లి, టమోటా, మిరప తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఎకరాకు రూ.50వేల పరిహారంతో పాటు రబీ సీజన్‌లో 90శాతం సబ్సిడీతో విత్తనాలు ఇచ్చి, బ్యాంకు రుణాలు మాఫీ చేయాలన్నారు. సుధాకర్, మహబూబ్ బాషా, వలి, రవీంద్ర, అయ్యన్న, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు

- సెట్కూరు సీఈవో వేణుగోపాల్

ఓర్వకల్లు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు విద్యార్థులకు మేలు చేకూరుతుందని సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్ అన్నారు. సోమవారం సోమయాజులపల్లె గ్రామం బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య, వ్యక్తిగత బీమాపై జీఎస్టీ ఉండదన్నారు. అలాగే యోగా, జిమ్ సెంటర్లలో 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలన్నారు. స్టేట్ జీఎస్టీ డీసీ నిర్మల, ఇన్‌చార్జి ఎంపీడీవో రమణయ్య, నూతన జీఎస్టీ స్లాబ్‌లపై కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, సర్పంచ్ జయమ్మ, కార్యదర్శి లక్ష్మికాంతరెడ్డి, కాకి దేవేంద్ర, ఆకుల మహేష్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

కల్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాలని రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం నాయకులు డి.శ్రీనివాసరావు, సి.మహేష్ ఆధ్వర్యంలో కల్లూరు, కర్నూలు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. పత్తి, ఉల్లి, టమోటా సాగుచేసిన రైతులు అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము పత్తికొండ, ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో పంటల పరిశీలన యాత్ర చేశామని, రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. రామకృష్ణారెడ్డి, కె.శ్రీనివాసులు, నల్లన్న, బీసన్న, భద్రకుమార్, సురేష్ పాల్గొన్నారు.

హామీ నెరవేర్చిన చంద్రబాబు



క్షీరాభిషేకం చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

సి. బెళగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారని ఆటోయూనియన్ నాయకుడు లింగన్న, రాజు అన్నారు. సోమవారం సి.బెళగల్‌లో టీడీపీ కన్వీనర్ చంద్రశేఖర్ అధ్యక్షతన సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తల్లికివందనం, ఉచిత గ్యాస్, పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ, మహిళలకు ఉచితబస్సు, అన్నక్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిందన్నారు. బాలజివెంకటేశ్, దనుంజయుడు, వెంకటేశ్వర్లు, గోవిందు, తిమ్మప్ప, జి.దూద్‌వలి పాల్గొన్నారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

కర్నూలు క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని వెంకాయపల్లె ఎల్లమ్మ వద్ద ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వివరాల మేరకు.. అశోక్ నాయక్, మరో ఐదు మందిపైన మొదటి వర్గం దాడి చేసి గాయపరిచారు. బాధితులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తాలుకా పోలీసులు కేసును విచారణ చేస్తున్నారు.

పరిహారం ఇవ్వాలి

సి. బెళగల్, అక్టోబరు 6 ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రాజు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. గత నెల కురిని భారీ వర్షాలకు కంది, పత్తి, మిరప, వెరుశనగ, ఆముదం, కొర్ర, సజ్జ, ఉల్లి పంటలు దెబ్బతిన్నాయన్నారు. గిట్టుబాటు లేకపోవడంతో ఉల్లి పంటను రైతులు గొర్రెలకు వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలనికోరారు. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. శేషు, మద్దిలేటి, శ్రీనివాసులు, దుబ్బన్న, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

చౌడేశ్వరి దేవికి పట్టువస్త్రాలు సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే

ఓర్వకల్లు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు చౌడేశ్వరి దేవికి సోమవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు మేళతాళాలతో స్వాగతం పలికారు. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కాటసాని పూజలు

మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ దంపతులు పూజలు చేశారు. ప్రభాకర్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు.

మాట్లాడదామని.. వైసీపీ కండువా కప్పారు

- దిన్నెదేవరపాడు ఎంపీటీసీ రామనాథ్‌రెడ్డి



ఎమ్మెల్యే, కేడీసీసీబీ చైర్మన్‌తో ఎంపీటీసీ

కర్నూలు రూరల్ అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): తనతో మాట్లాడదామని పిలిచి వైసీపీ నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఇంటి వద్దకు తీసుకెళ్ళి వైసీపీ కండువా కప్పారని దిన్నెదేవరపాడు ఎంపీటీసీ-2 రామనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం రామనాథరెడ్డికి కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి టీడీపీ కండువా కప్పి తిరిగి పార్టీలోకి ఆహ్వానించారు. రామనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 2న దసరా రోజు తాను స్వచ్ఛందంగా టీడీపీలో చేరానన్నారు. అయితే దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఇంటివద్దకు తీసుకెళ్లి బలవంతంగా వైసీపీ కండువా కప్పి, వీడియో, ఫోటోలు తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేశారని ఆరోపించారు. తాను టీడీపీలో కొనసాగుతానని విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి నాయకత్వంలో పార్టీకోసం పనిచేస్తానని రామనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు.

రహదారి పనుల పరిశీలన

సి. బెళగల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి పలుకుదొడ్డి మీదుగా సంగాల వరకు నిర్మిస్తున్న రహదారి పనులను పీఆర్ ఏఈ వెంకట్ ప్రకాశ్, ఎంపీడీవో రాణెమ్మ సోమవారం పరిశీలించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి రూ.3కోట్లను మంజూరు చేశారన్నారు. టీడీపీ నాయకులు రాజు, రాంభూపాల్‌రెడ్డి, హనుమంతు గౌడు, గిడ్డయ్యగౌడ్ ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట

ఆదోని అగ్రికల్చర్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఎంతో ఊరట లభించిందని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్స్, సిద్దప్ప, నాగముద్దయ్య, కవిత అన్నారు. సోమవారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఆయా దుకాణాలకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.


కరపత్రాలను అందజేస్తున్న వార్డెన్లు

వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకుందాం

ఆలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని వాల్మీకి సంఘం జేఏసీ నాయకులు భాస్కర్‌నాయుడు, మొలగవల్లి రామాంజినేయులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్ అండ్‌బి అతిథి గృహంలో వారు మాట్లాడుతూ మంగళవారం జరిగే వాల్మీకి జయంతి వేడుకలను పార్టీలకు అతీతంగా నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు వాల్మీకి మహర్షి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు శ్రీధర్, చంద్రశేఖర్, తిక్కస్వామి, కిరణ్, బుగులు వీరేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వాల్మీకి సంఘం జేఏసీ నాయకులు బోయ భాస్కర్

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ప్రధాన కార్యదర్శి షాబీర్ భాషా, సీపీఐ పట్టణ కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 10 మెడికల్ కళాశాలలో పీపీపీ విధాన నిర్ణయాన్ని క్యాబినేట్‌లో ఆమోదించడం దుర్మార్గం అన్నారు. ఈ విధానం వల్ల వందలాదిమంది ప్రతిభ గల పేద బడుగు బలహీనవర్గాలకు చెందిన ఎంబీబీఎస్ విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు దస్తగిరి, శ్రీకాంత్, శేఖర్, శివ, మోహన్, వంశీ, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని పెద్ద తుంబలం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మారుతీ ప్రియా, ఫిజికల్ డైరెక్టర్ నరసింహ రాజు తెలిపారు. సోమవారం ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు. వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కర్నూలు గవర్నమెంట్ కాలేజీ ఆవరణలో జిల్లా స్థాయి అండర్-14, అండర్- 17 ఫుట్ జట్లు ఎంపిక జరిగిందన్నారు. అందులో తొమ్మిదో తరగతి విద్యార్థి శేక్షావలి అండర్-14 విభాగంలో, పదో తరగతి విద్యార్థి రెహాన్ అండర్-17 విభాగంలో ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ నాయకుడు మోదీ

ఆదోని టౌన్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : దేశం గర్వించదగ్గ అనేక పనులను చేపట్టిన దేశ ప్రధాని నరేంద్ర మోదీని యావత్తు ప్రపంచ దేశాలు అభినందిస్తున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఐదు దేశాలకు మాత్రమే శాశ్వత సభ్యత్వం ఉన్న ఐక్యరాజ్య సమితిలో భారతదేశానికి 6వ దేశంగా శాశ్వత సభ్యత్వం లభించేలా మోదీ కృషి చేశాడన్నారు. 146 దేశాల మద్దతు కూడగట్టడం అందరికీ సాధ్యం కాదని, మోదీ చేసి చూపించాడని అన్నారు.

నష్టపోయారు.. ఆదుకోండి

గత నెలన్నర నుంచి కురిసిన వర్షాలకు సాగు చేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయి. దిగుబడి తగ్గి పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులను ఆదుకోవాలని సోమవారం వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ఆయా తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టి అధికారులకు వినతిపత్రాలను అందజేశారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి


పత్తికొండ: ఉల్లి, టమోటాలను పారబోసి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు రైతులు సాగుచేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయని, రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్, మండల కార్యదర్శి కారుమంచి, రైతుసంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సురేంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఆర్.భవన్ నుంచి సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఉల్లి, టమోటా, పత్తి, సజ్జ పంటలతో నిరసన ర్యాలీ చేపట్టారు. రోడ్డుపై ఉల్లి, టమోటా, పత్తి తదితర పంటలను పారబోసి నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలకు కర్నూలు జిల్లా రైతాంగమే అతలాకుతలమయ్యారన్నారు. అధికారులు పంట పొలాల్లో పర్యటించి ఏ రైతుకు ఎంత నష్టం జరిగిందో సమగ్ర నివేదికలు తయారు చేయాలన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు గురుదాస్, రామాంజనేయులు, ఉమాహేష్, రంగన్న, వెంకటరామిరెడ్డి, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలి


మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందుకు వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతు గిట్టుబాటు ధర అందక తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కనీస మద్దతు ధరతో రైతులను ఆదుకోవాలని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వైసీపీ రైతు విభాగం నాయకులు పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పత్తి క్వింటాలు రూ. 7500 మించి ధర అందడం లేదన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులతో కలసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, గుర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

దేవనకొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు పంటలు నష్టపోవడంతో దేవనకొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ అధ్వర్యంలో తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయాల ఎదుట నిరసన చేశారు. కరువు మండలంగా ప్రకటించి, ఎకరాకు రూ.50 వేల పంటనష్ట పరిహామిచ్చి రైతులను ఆదుకొవాలని తహసీల్దార్ రామాంజినేయులు, ఏవో ఉషారాణి కి వినతి పత్రం ఇచ్చారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ నాయకులు బజారి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతుగా నిలవాలి

చిప్పగిరి: అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు అండగా నిలవాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షిని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు మునిస్వామి కలిసి కోరారు. కర్నూలు జిల్లాలో అతివృష్టి విపత్తుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం ఇచ్చేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, పెద్దయ్య, రంజాన్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50వేలు పరిహారమివ్వాలి

మద్దికెర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి నబీ రసూల్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ గూండాల్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగరాజు, నెట్టికంటయ్య, బొజ్జన్న పాల్గొన్నారు.


మద్దికెరలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పరిహారం చెల్లించాలి

ఆలూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాక భూపేష్, సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతు సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆలూరు తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విజయకుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి బాషా, చాపాల గోపాల్, రామంజి, గోవిందు, భీమన్న పాల్గొన్నారు.


ఆలూరు: డీటీ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

తుగ్గలి: వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల అధ్యక్షుడు సుల్తాన్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తుగ్గలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఐ పార్టీ నాయకులు, రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పరి: అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆఫీసు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. నాయకులు రమేష్, హనుమంతు, బడేసాబ్, కృష్ణ, నల్లన్న, హనుమంతు, ఆంజనేయ, రామంజిని పాల్గొన్నారు.

బొందిమడుగుల బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

తుగ్గలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బొందిమడుగుల- మారెళ్ల గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులను సర్పంచ్ చౌడప్ప, సలహాదారుడు ప్రతాప్‌యాదవ్ సోమవారం ప్రారంభించారు. బ్రిడ్జి గత ఐదేళ్ల క్రితం కూలిపోయిది. రూ.49 లక్షలతో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే శ్యాంబాబుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బ కాశీం, వీరేంద్ర పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలి

హొళగుంద, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేరణికి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ షఫీపై చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా మిడుతూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య సోమవారం హొళగుంద ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ తనకు మిడుతూరులో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర హార్డ్వేర్ ఉందని, కర్నూల్, నంద్యాల జిల్లాలోని పలు గ్రామ పంచాయతీలకు సున్నం, బ్లీచింగ్ పౌడర్‌తో పాటు ఇతర వస్తువులను సరఫరా చేస్తుంటానని తెలిపారు. 2023 సెప్టెంబర్‌లో జరిగిన దేవరగట్టు బన్నీ ఉత్సవాల కోసం తన వద్ద నెరణికీ పంచాయతీ కార్యదర్శి షఫీ రూ. 1,23,000 విలువ గల 100 సంచుల సున్నం, 80 బస్తాల బ్లీచింగ్ పౌడర్‌ను కొనుగోలు చేసి బిల్లులు వచ్చాక డబ్బులు చెల్లిస్తానని చెప్పి, రెండేళ్లయిన డబ్బులు ఇవ్వలేదని వాపోయాడు. ఈ విషయంపై ఎంపీడీవో విజయలలితను వివరణ కోరగా విచారణ చేసి బాధితుడికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు వేయండి

క్రిష్ణగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): 44వ జాతీయ రహదారిలో గుంతలు పడ్డాయని, గుంతలు పూడ్చిన తర్వాత టోల్ వసూలు చేయాలని నంద్యాల సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కార్యవర్గ సభ్యుడు సుంకయ్య డిమాండ్ చేశారు. సోమవారం అమకతాడు టోల్ ప్లాజా మేనేజరకు వారు వినతి పత్రం ఇచ్చారు. గుంతలు పడడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారిందన్నారు. కార్యక్రమలో కోయిలకొండ నిగరాజు,రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు దళిత విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మద్దికెర అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలోని 2024-25 లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన దళిత మాదిగ విద్యార్థులకు బండారు తిమ్మయ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గౌరయ్యస్వామి, అన్నపూర్ణ, అతివర్ణ ఆశ్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని సేవా సంస్థల నిర్వాహకులు బండారు చిత్తరంజన్‌దాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు పారా రాఘవేంద్ర తెలిపారు. సోమవా రం వారు మాట్లాడుతూ మండలంలోని జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మాదిగ విద్యార్థులకు బండారు తిమ్మయ్య జన్మదినం పురస్కరించుకుని విద్యార్థులకు మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ.15వేలు, నాలుగో బహుమతి రూ.10వేలు, ఐదో బహుమతి రూ.5వేలు అందజేస్తామని తెలిపారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

పత్తికొండ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై కింద పని చేస్తున్న హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రవిచంద్ర, సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మార్కెట్‌యార్డులో సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ మండల మహాసభ జరిగింది. నూతన కమిటీని ఎన్నుకున్నారు. సివిల్ సప్లై హమాలీ సంఘం కార్యదర్శిగా చంద్రను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాల్, హమాలీ నాయకులు చిన్నహుసేన్, పెద్దహుసేన్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో ఆటో డ్రైవర్ల సంబరాలు

మద్దికెర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో కూట మి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని అమలు చేయడంతో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు విగ్రహానికి సో మవారం ఆటో డ్రైవర్లు క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సోమవారం వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు నాయుడు ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికీ రూ.15వేలు తమ ఖాతాలో జమ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.


పెరవలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న ఆటో డ్రైవర్లు

షరతులు లేకుండా పథకాన్ని అమలు చేయాలి

పత్తికొండ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకునేందుకు ప్రతి ఆటో కార్మికుడికి షరతులు లేకుండా పథకాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు మాదన్న, సీపీఐ మండల కార్యదర్శి కారు మంచి డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కవితకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో దూదేకొండ ఎంపీటీసీ వీరన్న, ఏఐటీయూసీ నాయకులు రాజప్ప, ఆటో యూనియన్ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'గుంటుపల్లె'ని ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయండి

వెల్దుర్తి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గుంటుపల్లె గ్రామాన్ని 'ప్రత్యేక గ్రామ పంచాయతీ'గా ఏర్పాటు చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఈదుల వెంకటరాముడు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో సుహాసినమ్మ, డిప్యూటీ ఎంపీడీవో రవికిశోర్, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ కు గ్రామస్తుల సంతకాల సేకరణతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.


ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

ఆదోని, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పేర్కొన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్ పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజా, ఆర్టీసీ డిపో మేనేజర్ రఫీ, వ్యవసాయశాఖ అధికారి ఖాద్రి, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభరెడ్డి, గృహనిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఆర్డీవో కార్యాలయపు పరిపాలనాధికారి రమాదేవి, ఉప తహసీల్దార్ రుద్ర గౌడ్, శశిశేఖరరావు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

తూములు తెరవండి

మద్దికెర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామ శివారులోని యజ్ఞం చెరువు ఆయకట్టు తూములు తెరవాలని, లేకపోతే మా పంటలు నాశనం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ గూండాల్ నాయక్‌కు రైతులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యజ్ఞం చెరువు పూర్వం తవ్వించారని, యజ్ఞం చెరువు కింద ఆయకట్టు కూడా ఉందని, అప్పుడు వర్షాభావ పరిస్థితుల వల్ల యజ్ఞం చెరువు ఆయకట్టు తూములను మూసివేశారని తెలిపారు. ఈ ఏడాది భారీ వర్షాలు రావడంతో చెరువు నిండి పొలాల్లోకి నీరు రావడంతో పంటలు నాశనం అవుతున్నాయని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ గూండాల్ నాయక్ మాట్లాడుతూ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు ఉన్నారు.

డీఐజీని కలిసిన వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను సోమవారం రాత్రి ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలపై చర్చించారు.


డీఐజీ ను పూలమాలతో సన్మానిస్తున్న వైకుంఠం జ్యోతి, శివప్రసాద్

రేషన్‌దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

పత్తికొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పత్తికొండ మండపరిధిలోని హోసూరు గ్రామంలో రేషన్‌దుకాణాలపై విజిలెన్స్ విజిలెన్స్ తహసీల్దార్ వెంకటరమణ, అసిస్టెంట్ జియాలజిస్టు సిద్దయ్యలు తనిఖీలు నిర్వహించారు. 2 దుకాణాలలో రిజిష్టర్ ప్రకారం ఉండాల్సిన బియ్యం కంటే అధిక మొత్తంలో బియ్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. దుకాణదారులు సరైన వివరాలు చూపకపోవడంతో దుకాణాలను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారని సీఎస్‌డీటీ షెహనాజ్ తెలిపారు.

దేవాలయంలో చోరీ...

హాలహర్వి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చారపల్లి గ్రామంలోని సుంకులమ్మ దేవాలయంలో చోరీ జరిగిందని ఆ గ్రామస్తులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ 70 తులాల వెండి విగ్రహం, 15 గ్రాముల బంగారం చోరీ జరిగిందని, వెంటనే ఈ విషయాన్ని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ మారుతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

3 తులాల బంగారం అపహరణ

ఆలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం అగ్రహారం గ్రామంలో సోమవారం ఉరుకుందప్ప ఇంట్లో ఉన్న బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 3 తులాల బంగారాన్ని అపహరించుకుపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కాశింవలి ఆధ్వర్యంలో సోమవారం ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని వీధుల్లో తిరుగుతూ బీజేపీ ఓటు చోరీ చేసిందని సంతకాల సేకరణను చేశారు. ఈ సందర్భంగా కాశింవలి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడి కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే పేద ప్రజల సంక్షేమం జరుగుతుందన్నారు. బడుగు బలహీన వర్గాలకు కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హసీఫ్, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటా

కౌతాళం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటానని టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్ అన్నారు. కౌతాళంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త నేసే అంజి భార్య ఈరమ్మ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప సోదరుడు కాశీవిశ్వనాథ్ కార్యకర్త అంజి ఇంటికెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మట్టి ఖర్చులకు రూ.5వేల నగదును మృతురాలి కుమారుడికి అందజేశారు. ఆయన వెంట టీడీపీ కార్యకర్తలు మంజునాథ, రాజబాబు, సిద్దు, భీమయ్య, షగ్గి నాగ తదితరులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు తప్పనిసరి

నందవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధికి టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని డాక్టర్ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం నందవరంలో గాలికుంటు వ్యాధులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలకు కూడా నీలి మందు నివారణ టీకా వేశామన్నారు. పారుడు రోగంతో పశువులు ఇబ్బందులు పడుతుంటాయని, దీంతో వాటికి నోటిలో పురుగులు వస్తాయని, వెంటనే గెట్టు పురుగు మందు వాడాలని సూచించారు.

పంట కోత ప్రయోగంపై అవగాహన

మంత్రాలయం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పంట కోత ప్రయోగంపై అవగాహన కల్పించాలని ఏఏవో వి.సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏవో గణేష్, ఏఈవో తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ వీఏఏలు, వీహెచ్ఏలకు పంట ప్రయోగంపై అవగాహన కల్పించారు. పత్తి, వరి కోతల ప్రయోగంపై అవగాహన కల్పించారు.

ఈ క్రాప్ నమోదు గడువు పొడిగింపు

పెద్దకడబూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ పంట డిజిటల్ సర్వే నమోదు ఈనెల అక్టోబరు 25వ తేదీ వరకు గడువు పొడిగించారని ఏవో సుచరిత తెలిపారు. సోమవారం పెద్దకడబూరులో ఈ క్రాప్ నమోదు చేశారు. ఈకేవైసీ పూర్తి చేసుకున్న పంటలకు మాత్రమే భీమా వంటి ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు.

స్పందనకు అధికారులు డుమ్మా


స్పందనకు హాజరు కాని అధికారులు

నందవరం,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు కరువయ్యారు. సోమవారం జరిగిన స్పందనకు ఆంధ్రజ్యోతి 10 గంటల నుంచి 11.55 వరకు విజిట్ నిర్వహించింది. ఉదయం 10 గంటలకు తహసీల్దారు శ్రీనివాసులు, సర్వేయర్ అక్బర్ బాషా హాజరయ్యారు. 10:25కు ఆస్పత్రి సీహెచ్‌వో బలరాం, ఆ తర్వాత అదనపు ఎంపీడీవో సందీప్ 10:45 నిముషాలకు, మిగిలిన హౌసింగ్, ఐసీడీఎస్ అధికారులు 11:00 గంటలకు వచ్చారు. ప్రజలు వివిధ సమస్యలతో కార్యాలయానికి రాగా అక్కడ తహసీల్దారు ఒక్కరే ఉండటంతో వారి సమస్యలకు పరిష్కారం లభించడం కష్టమవుతోంది. మీ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేస్తాం అని వారికి తహసీల్దారు చెప్పి పంపుతారు. ఇలా స్పందనలో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారుతుంది. దీనికితోడు ఇది మారుమూల మండలం కావడంతో ఉన్నతాధి కారులు రారు అన్న ధీమా అధికారుల్లో ఉంది. తహసీల్దారును వివరణ కోరగా ఇలాగే కొనసాగితే ఉన్నతాధికారులకు నివేదిక అందించి వారిపై చర్యలు తీసుకుంటాన్నారు.

వృత్తి విద్య కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

కౌతాళం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వృత్తి విద్య కోర్సుల ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పీఎంశ్రీ వృత్తి విద్య కోర్సుల శిక్షణ ఉద్యోగి రాజు అన్నారు. కౌతాళంలో సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్య కోర్సుల ఇంటర్న్‌షిప్‌లో భాగంగా పదవ తరగతి విద్యార్థులకు గత నెల 22 నుంచి ఆక్టోబరు 2 వరకు 10రోజుల వర్క్‌షాపు ఏర్పాటు చేశామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రెడ్డి, వృత్తి విద్య శిక్షణకుడు రాజు తదితరులు ఉన్నారు.

దళిత కాలనీలు అంటే అంత చులకనా..?


మాట్లాడుతున్న ఏమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు

కౌతాళం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అధికారులకు దళిత కాలనీలు అంటే అంత చులకనా అని ఏమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు అన్నారు. సోమవారం జైభీమ్ వ్యవస్థాపకుడు అవతారం, గ్రామ దళితులతో కలిసి రోడ్డుపై రెండు గంటలు పాటు ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఎరిగేరి గ్రామం ఎస్సీ కాలనీల్లో ఆర్డీడీ వారు 100 ఇళ్లను నిర్మించి దళితులకు అందజేస్తే ఆ కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు గుంతలమయంగా ఉన్నాయన్నారు. డ్రైనేజీ కాలువలు లేక ఇళ్ల నీరు మధ్యనే నిలిచి ఉందన్నారు. రాత్రి సమయాలలో దోమలు, విష పురుగుల సంచారం అధికంగా ఉండటంతో ఇళ్ల నుంచి ప్రజలు బయట కు వచ్చేందుకు బయటపడుతున్నారన్నారు. రెండు గంటల పాటు ధర్నా చేపట్టడంతో కిలోమీటరు మేర ట్రాఫిక్ స్తంభించింది. ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీఐ అశోక్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని నాయకులకు సర్దిచెప్పారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతామని తెలపడంతో తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి స్పందిస్తూ సమస్యను కలెక్టర్‌కు తెలిపి పరిష్కరించేలా చూస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. గ్రామస్థులు వీరేష్, సాల్మన్, రాజు, చిన్న పాల్గొన్నారు.

రూ.50వేల నష్టపరిహారం అందజేయాలి


ఎమ్మిగనూరు రూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులందరికీ రూ.50 వేల పరిహారం అందజేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, రైతు సంఘం జిల్లా కోశాధికారి కేసీ జబ్బార్, మండల కార్యదర్శి రాజీవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు.

గోనెగండ్ల : ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసే వరకు పోరాటం ఆగదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు మద్దిలేటి నాయుడు హెచ్చరించారు. సోమవారం సీపీఐ నాయకులు, రైతులు అరగంట పాటు ధర్నా నిర్వహించారు.

మంత్రాలయం: వర్షంతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

పెద్దకడబూరు: అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి హనుమంతు, జిల్లా కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ గీతా ప్రియదర్శినికి వినతి పత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్ నాయకులు రామాం జనేయులు, చిన్న ఈరన్న, తిమ్మయ్య చిన్న నరసన్న పాల్గొన్నారు.

భవన నిర్మాణ నిధులు కార్మికులకే అందించాలి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ నిధులను కార్మికులకే అందించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమ వారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను భవన, ఇతర నిర్మాణ కార్మికులకు మాత్రమే అందజేయాలన్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో పనులు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 1214 జీవోను రద్దు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇసుకను వెంటనే ఉచితంగా అందించాల న్నారు. బాబు, మల్లికార్జున, వెంటేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం కార్యదర్శి గోవిందు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ పట్టణ శివారులో నిర్మించిన టిడ్కో గృహాలలో లబ్ధిదారులు నివాసం ఉంటున్నారన్నారు. అక్కడ మౌలిక వసతులు కల్పించాలన్నారు. కరెంటు, డ్రైనేజీ సౌకర్యం, వీధిలైట్లు బాత్రూంలకు పైప్ లైన్‌లు లేక అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శివన్న నగర్ నుంచి టిడ్కో గృహాల వరకు మెయిన్ రోడ్డు వద్ద వీధి లైట్లు లేకపోవడం వలన అక్కడి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముళ్లపొదలు విపరీతం గా పెరగడం వల్ల పాముల బెడద ఎక్కువైందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అవాసంగా మారింద న్నారు. కావున మౌలిక వసతులు ఏర్పాటు చేసి మిగతా లబ్ధిదారులు కూడా ఇళ్లలోకి వచ్చేలా చూడాలన్నారు. అక్కడ పోలీసు పహారాను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, కమిషనర్ గంగిరెడ్డి దీనిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అబ్దుల్లా, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం


మాట్లాడుతున్న సూర వెంకట రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ సమైక్యతే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని కర్నూలు జిల్లా సహ సంఘ చాలక్ సూర వెంకట్ రెడ్డి అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో విజయ దశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ హిందుత్వ ఐక్యతను కాపాడు కోవాలని కోరారు. ఎమ్మిగనూరు ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు గడిగే లింగప్ప, మాచాని వినోద్ కూమార్, బస్తీ ప్రముఖ్ మారుతి, కాసుల రాము తదితరులు పాల్గొన్నారు.